సాక్షి నిజామాబాద్

శనివారం । 11 । మార్చి । 2023



ప్రశ్నార్థకంగా ప్రసూతి సేవలు

గైనకాలజిస్టు, మత్తు వైద్యుడు లేకపోవడంతో మోర్తాడ్ సీహెచ్‌సీలో రెండేళ్లుగా ప్రసూతి సేవలు నిలిచిపోయాయి.

- 8లో ▸



నియోజకవర్గ అభివృద్ధికి కృషి

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /21.9

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సైన్స్ విభాగం డీన్‌గా ఆరతి నియామకం



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతిని సైన్స్ విభాగం డీన్‌గా నియమించారు. శుక్రవారం వీసీ రవీందర్ చేతుల మీదుగా ఆరతి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. తనపై నమ్మకంతో డీన్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్ విద్యావర్ధినికి ఈ సందర్భంగా ఆరతి కృతజ్ఞతలు తెలిపారు.

13న పెన్షన్ అదాలత్

నిజామాబాద్ సిటీ : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ రీజినల్ కమిషనర్ డి హనుమంతప్ప ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 11 గం నుంచి 11.40 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెన్షనర్లు తమ సమస్యలు తెలుపొచ్చన్నారు. ఫిర్యాదుదారులు webex వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 26438085322 పాస్‌వర్డ్ enf1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



బోధన్ : ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కాయకల్ప బృందం సభ్యులు వైద్యులకు సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం కాయకల్ప అధికారులు సందర్శించారు. కాన్పుల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. బాలింతలతో మాట్లాడి వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కాయకల్ప అధికారుల బృందంలో రఘు పూజారి, రహ్మాన్, ప్రశాంత్, సిస్టర్ స్టెల్లా, ఆస్పత్రి పరిపాలనాధికారి శివశంకర్ తదితరులు ఉన్నారు.

నేడు నిరుద్యోగులకు జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని టామ్‌కామ్ ద్వారా అర్హత, నైపుణ్యం కలిగిన కార్మికులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మెయింటెనెన్స్ టెక్నీషియన్లు, ఫిట్టర్లు, హెవీ డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ సిస్టమ్ టెక్నీషియన్లు తదితర నైపుణ్యం కలిగిన కార్మికులకు అధిక డిమాండ్ ఉందన్నారు. ఈ ఉద్యోగాలు ఆకర్షణీయమైన జీతం, ప్యాకేజీతో ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ఉపాధి కార్యాలయం, ఐటీఐ క్యాంపస్, శివాజీనగర్‌లో శనివారం జాబ్‌మేళా ఉందని, వివరాలకు 99594 56793, 63057 43423ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, వర్క్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

యువతే దేశ భవిష్యత్తు



బోధన్ : యువతే మన దేశ భవిష్యత్ అని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) ఆధ్వర్యంలో జిల్లా యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మాక్ పార్లమెంట్ సెషన్ నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ శైలి బెల్లాల్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రాచయ్య, కళాశాల ప్రిన్సిపాల్ రంగరత్నం, వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

జోష్ నింపేనా..!



ఎమ్మెల్యేల అవినీతిని ఎండగడతాం

పాదయాత్రలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీస్తాం. మంత్రి ప్రశాంత్‌రెడ్డి గుట్టల తవ్వకం, గణేశ్‌గుప్తా కబ్జాలు, షకీల్ బియ్యం కుంభకోణం, జీవన్‌రెడ్డి ఆగడాలు, బాజిరెడ్డి ఇలాకాలో మంచిప్ప సామర్థ్యం అవసరం లేకున్నా పెంచి ముంపునకు గురిచేయడంలాంటివి ప్రజలకు వివరిస్తాం. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు హామీపై ఎండగడుతాం.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

- నేడు జిల్లాకు చేరుకోనున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- 17 వరకు ఐదు నియోజకవర్గాల్లో పాదయాత్ర
- సుదర్శన్‌రెడ్డి, మధుయాష్కీ మధ్య గ్యాప్ నేపథ్యంలో కార్యకర్తల్లో చర్చ

కమ్మర్‌పల్లిలో రేవంత్‌రెడ్డి బస ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పలు కార్యక్రమాలు చేపడుతున్నా.. కొన్ని నియోజకవర్గాల్లో నాయకత్వ కొరత ఆపార్టీని ఇబ్బంది పెడుతోంది. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభించనా.. రెండు మూడు నియోజకవర్గాల్లో మాత్రమే ఉత్సాహంగా సాగుతోంది. ఆర్మూర్ నియోజకవర్గంలో నాయకత్వం లేక నాలుగు గ్రామాల్లో మాత్రమే చేశారు. ఇక అర్బన్ నియోజకవర్గంలో ఊసే లేదు. ఈ పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర శనివారం రాత్రి జిల్లాలోకి ప్రవేశించనుంది. ఆదివారం నుంచి ఈ నెల 17 వరకు ఐదు నియోజకవర్గాల్లో రేవంత్‌రెడ్డి పాదయాత్ర జరుగనుంది. అయితే మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ మధ్య గ్యాప్ ఉండడంతో పార్టీ శ్రేణుల్లో ఈ విషయమై చర్చ జరుగుతోంది. ప్రతిష్టాత్మకమైన ఈ పాదయాత్ర నేపథ్యంలో జిల్లా నాయకత్వం వ్యవహార శైలిపైనే కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. డీసీసీ పీఠం మరోసారి మానాల మోహన్‌రెడ్డికి దక్కేలా పావులు కదిపిన సుదర్శన్‌రెడ్డి మరికొందరికి పదవులు రాకుండా అడ్డుపడ్డారనే చర్చ ఇప్పటికే నడుస్తోంది. తనకు డీసీసీ పీఠం దక్కకుండా సుదర్శన్‌రెడ్డి అడ్డుపడ్డారంటూ బాడ్సి శేఖర్‌గౌడ్ ఇప్పటికే కోపంగా ఉన్నారు. అయితే శేఖర్‌గౌడ్‌కు పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర పదవుల్లో ఉన్న నాయకులు చెబుతుండడం గమనార్హం. ఈ పాదయాత్రతో కాంగ్రెస్‌లో జోష్ పెరుగుతుందా అనే చర్చ నడుస్తోంది.

కోరుట్ల నియోజకవర్గం నుంచి..

ఖలీల్‌వాడి : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన యాత్ర శనివారం కోరుట్ల నియోజకవర్గం నుంచి బాల్కొండలోని కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చేరుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి 9 గంటలకు నిజామాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన గండిహనుమాన్ వద్ద రేవంత్‌రెడ్డి పాదయాత్రను పార్టీ శ్రేణులు ఆహ్వానించనున్నాయి. రాత్రి కమ్మర్‌పల్లిలోని శుక్రవారం దేవి ఆలయం వద్ద బసకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, పీసీసీ జాయింట్ సెక్రెటరీ బాస వేణుయాదవ్ పరిశీలించారు. 12న యాత్రకు బ్రేక్ ఉండటంతో ఉదయం 10 గంటలకు భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్టపై పూజలు చేసి, 11 గంటలకు రైతులతో సమావేశమవుతారు.

రూ.పది కోట్లతో ధాత్రిలో వసతులు

- ఈ నెల 16, 17, 18 తేదీల్లో బహిరంగ వేలం ద్వారా ప్లాట్ల విక్రయాలు
- ప్రీ బిడ్ సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : నగరానికి ఆనుకుని మల్లారం వద్ద ప్రభుత్వపరంగా నెలకొల్పిన ధాత్రి టౌన్‌షిప్‌లో ప్లాట్లను కొనుగోలు చేసి భవిష్యత్ పెట్టుబడులకు మార్గం సుగమం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఇప్పటికే రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, సుమారు రూ.10 కోట్లతో డ్రెయినేజీలు, నీటి వసతి, విద్యుద్దీకరణ, ప్రహరీ నిర్మాణం, ప్లాంటేషన్ వంటి మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ ఏడాదిలోపే పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు కొత్త కలెక్టరేట్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తు అవగాహన కల్పించేందుకు వీలుగా శుక్రవారం ఐడీఓసీలో కలెక్టర్ ఆధ్వర్యంలో మలివిడత ప్రీ బిడ్డింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, రిటైర్డ్ ఎంప్లాయీస్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, ఔత్సాహికులకు ధాత్రి టౌన్‌షిప్ ప్రత్యేకతల గురించి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. అందుబాటు ధరకే ప్రభుత్వపరంగా బహిరంగ వేలం ద్వారా నివాస స్థలాలు విక్రయించనున్నందున మధ్య తరగతి వారు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం మరో 150 ప్లాట్ల విక్రయాల కోసం రెండో విడతగా ఈ నెల 16 , 17 , 18 తేదీల్లో ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుంచి కొత్త కలెక్టరేట్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

మొదటి రోజు ఉదయం సెషన్‌లో 25, మధ్యాహ్నం సెషన్‌లో 25 చొప్పున 50 ప్లాట్లకు, 17న 50 ప్లాట్లకు, 18న మిగతా 50 ప్లాట్లకు వేలంపాట నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశామన్నారు. తమకు నచ్చిన ప్లాట్‌ను నిర్ణీత తేదీలో జరిగే వేలంలో పాల్గొని దక్కించుకోవచ్చని సూచించారు. టీఎస్‌ఐఐసీ జిల్లా మేనేజర్ దినేష్, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, ఆయా శాఖల ఉద్యోగులు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

బీజేపీ నేత కారుపై రాళ్ల దాడి

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా.. పట్టణ శివారులోని మాధవనగర్ సాయిబాబా ఆలయం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రాళ్లతో దాడిచేసి వాహనాన్ని ధ్వంసం చేశారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ కార్పొరేటర్లు న్యాలం కిషన్, ప్రమోద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. టీఆర్‌ఎస్ దాడులకు భయపడేది లేదని సమర్థవంతంగా ఎదుర్కొంటామని మీసాల చంద్రయ్య పేర్కొన్నారు. దాడి ఘటనపై ఇందల్వాయికి చెందిన బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కేపీ రెడ్డి యాదవ్ డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రాళ్లదాడిలో ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా, కార్పొరేటర్లు

లైసెన్స్‌డ్ ఏజెంట్లనే సంప్రదించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ నాగరాజు

సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి : విదేశాల్లో ఉపాధి పొందటానికి వెళ్లే ప్రజలు కేంద్ర ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని సీపీ కేఆర్ నాగరాజు సూచించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ప్రశాంతి నిలయంలో శుక్రవారం నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని గల్ఫ్ ఏజెంట్లు, సబ్ ఏజెంట్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లాడారు. లైసెన్స్ లేని వ్యక్తులు, సబ్ ఏజెంట్లతో ఎటువంటి సంప్రదింపులు చేయొద్దన్నారు. ఏజెంట్లు విదేశాలకు పంపే అభ్యర్థులకు ఉద్యోగ వివరాలు, వర్క్ ప్లేస్, పనిగంటలు, అతను పొందే ఇతర సదుపాయాలను తెలియజేయాలన్నారు. లైసెన్స్‌డ్ ఏజెంట్ల వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. లైసెన్స్ లేకుండా పని చేసే ఏజెంట్లను గుర్తించి సంబంధిత పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టూరిస్టు వీసాలపై పంపి ప్రజలను మోసం చేసే ఏజెంట్లపై పీడీయాక్ట్ పెడుతామని హెచ్చరించారు. ఏజెంట్లపై నిఘా పెట్టాలని ఎస్‌బీ అధికారులకు ఆదేశించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, పాస్‌పోర్టు కార్యాలయ ఎస్సై ఎస్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

మిగిలింది 20 రోజులే..

- 80 శాతం ఇంటి పన్నులు వసూలు
- 7 గ్రామాల్లో వందశాతం పూర్తి



మోపాల్ : ఇంటి పన్నుల వసూళ్లకు ఈ ఆర్థిక సంవత్సరానికి 20 రోజులే మిగిలి ఉంది. మొత్తం రూ.45,90,3,63 లకుగాను రూ.36,86,030 (80.72శాతం) వసూలయ్యాయి. ఇంకా రూ.9 లక్షలకుపైనే వసూలు కావాల్సి ఉంది. ఇప్పటికే ఏడు గ్రామాల్లో వందశాతం పన్నుల వసూళ్లు పూర్తయ్యాయి. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పన్నులపై దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మోపాల్ మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతియేటా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వందశాతం ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుంటారు. అందులో భాగంగానే 2022–23 సంవత్సరానికి మోపాల్ మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే చిన్నాపూర్, గుడితండా, కులాస్‌పూర్, కులాస్‌పూర్ తండా, ఒడ్డెరకాలనీ, సిర్‌పూర్, తాడెంలో వందశాతం పన్నులు చెల్లించారు. మంచిప్ప, నర్సింగ్‌పల్లి, శ్రీరాంనగర్ తండా, బాడ్సి, తదితర గ్రామాలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి.

మోపాల్‌ను ఆదర్శంగా తీసుకుని..


ఇంటి పన్నుల వసూళ్లకు గడువు ఇంకా 20 రోజులు మాత్రమే మిగిలి ఉంది. అప్పటిలోపు వందశాతం పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పన్నుల వసూళ్లపై దృష్టి సారించడంతో 80 శాతానికి పైగా లక్ష్యం చేరుకున్నామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన 20 శాతం కూడా పూర్తి చేసి వందశాతం పూర్తి చేసి ఇతర మండలాలకు మోపాల్‌ను ఆదర్శంగా ఉంచుతామని అధికారులు చెప్తున్నారు. కాగా ఇదే విషయమై ఎంపీడీవో లింగం నాయక్ వివరణ కోరగా, ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలని ఇప్పటికే గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు.

మండలంలో..

మండలంలోని అన్నిగ్రామాలకు కలిపి ఇంటి పన్నుల డిమాండ్ రూ.44,13,083, ఇతర పన్నుల డిమాండ్ రూ.1,77,280గా ఉంది. మొత్తం రూ.45,90,363 లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో ఇప్పటివరకు ఇంటిపన్నులు రూ. 35,72,805, ఇతర పన్నులు రూ.1,32,544 వసూలయ్యాయి. మొత్తం రూ.37,05,349 పన్నుల రూపేణా ప్రజలు చెల్లించారు. సుమారు 80.72 శాతం పన్నులు వసూలయ్యాయి. ఇంకా రూ.9,08,062 చెల్లించాల్సి ఉంది.

తెరపైకి గ్రీన్ హైవే..

- వేంపల్లి నుంచి మంచిర్యాల్ వరకు..
- 125 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక జాతీయ రహదారి
- స్థల సేకరణపై అధికారుల దృష్టి
- భారీగా వ్యవసాయ భూములను కోల్పోనున్న రైతులు



మోర్తాడ్(బాల్కొండ): జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా మన జిల్లా నుంచి మంచిర్యాల్ వరకు గ్రీన్ హైవే నిర్మాణానికి గతంలో చేసిన ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చే ప్రక్రియ మొదలైంది. జాతయ రహదారి 63కు అనుబంధంగానే ఆర్మూర్(వేంపల్లి) నుంచి మంచిర్యాల్ వరకు 125 కిలోమీటర్ల పొడవున గ్రీన్ హైవేను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా జగిత్యాల్ జిల్లాలో అవసరమైన భూ సేకరణ కోసం కలెక్టర్ యాస్మిన్ భాషా ఆధ్వర్యంలో అధికారులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఇక్కడ ఎలాంటి ప్రక్రియ మొదలుకాకపోయినా పొరుగు జిల్లాలో వేగంగా కార్యాచరణ కొనసాగుతుండటంతో గ్రీన్ హైవే మరోసారి చర్చకు వచ్చింది. గ్రీన్ హైవే ప్రతిపాదనల మరోసారి ముందుకు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 25 కిలోమీటర్ల పొడవున గ్రీన్ హైవే నిర్మాణం సాగనుంది. గ్రీన్ హైవే నిర్మాణం వల్ల జిల్లాలో విలువైన వ్యవసాయ భూములను రైతులు కోల్పోనున్నారు. బోధన్ నుంచి జగదల్‌పూర్ వరకు 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరించింది. ఇదే మార్గాన్ని విస్తరిస్తే మన జిల్లాలోను, పొరుగున ఉన్న జగిత్యాల్ జిల్లాలో భారీ మొత్తంలో ఇళ్లు, వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని నష్టాన్ని తగ్గించుకోవడానికి గ్రీన్‌హైవే ప్రతిపాదనను గతంలోనే రూపొందించారు. మంచిర్యాల్ వరకు ప్రత్యేక గ్రీన్‌హైవే ప్రతిపాదన 2017లోనే జరిగింది.

భూ సేకరణనే ప్రధానం

గ్రీన్ హైవేకు సంబంధించి భూ సేకరణనే ప్రధానం కానుంది. భూ సేకరణకు సంబంధించి గతంలోనే సర్వే నిర్వహించి హద్దురాళ్లు పాతారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భూ సేకరణ కమిటీ నోటిఫికేషన్ జారీ చేసి రైతులకు పరిహారంను నిర్ణయించే అవకాశం ఉంది. గ్రీన్‌హైవేకు భూములు ఇవ్వడంలో రైతులకు ఆసక్తి లేకపోయినా భూసేకరణ చట్టం వల్ల రైతుల వ్యతిరేకతకు పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఏది ఏమైనా గ్రీన్‌హైవే అంశం మరోసారి తెరపైకి రావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైతుందని చెప్పవచ్చు.

మన జిల్లాలో..

మన జిల్లాలో వేంపల్లి, రెంజర్ల, శెట్‌పల్లి, తొర్తి, తిమ్మాపూర్, ఏర్గట్ల వ్యవసాయ భూముల మీదుగా గ్రీన్‌హైవే నిర్మాణం జరుగనుంది. ఇందుకోసం నేషనల్ హైవే అథారిటీ గతంలోనే సర్వే నిర్వహించింది. గ్రీన్‌హైవేను రైతులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన భూసేకరణ చట్టం వల్ల రైతుల ఆందోళనలకు ఫలితం కనిపించే పరిస్థితి లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ హైవేకు అవసరమైన భూసేకరణ బాధ్యతను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిందని ఇప్పుడు చోటు చేసుకుంటున్న పరిణామాలను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారాన్ని నిర్ణయించాల్సి ఉంది. వ్యవసాయ భూముల ధరలు మార్కెట్‌లో ఎకరానికి రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు పలుకుతుంది. కాని గ్రీన్ హైవేకు భూములను సేకరించే తరుణంలో మార్కెట్ ధరకు అనుగుణంగా నష్ట పరిహారాన్ని నిర్ణయిస్తారా అనేది సంశయంగా మారింది.

భూసేకరణ చట్టం ప్రకారం రైతుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా భూ సేకరణ జరుగనుంది. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి పరిహారం ధర నిర్ణయించే సమయంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని పలువురు కో రుతున్నారు.

‘ప్లానింగ్’.. పదనిసలు



- వాణిజ్య భవనాలకు నివాస గృహ అనుమతులు
- బల్దియాలో టౌన్‌ప్లానింగ్ అధికారుల అక్రమాలు
- కాసులకు కక్కుర్తి పడి మున్సిపల్, బ్యాంకుల ఆదాయానికి గండి

నిజామాబాద్ నాగారం : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో కాసులకు కక్కుర్తి పడి అడ్డగోలు అనుమలు మంజూరు చేస్తున్నారు. కళ్ల ముందు వాణిజ్య భవనం కనిపిస్తున్నా నివాస గృహానికి సంబంధించిన అనుమతులు మంజూరు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

▪ ఖలీల్‌వాడిలో..

నగరం నడిబొడ్డున ఖలీల్‌వాడిలో ఒక డిస్పెన్సరీ నిర్మాణానికి 2019 మే 5న వాణిజ్యపరంగా అనుమతి తీసుకున్నారు. ఇందుకోసం ఫీజు రూ. 3,34,446 కూడా కట్టారు. అయితే వాణిజ్యపరంగా వెళ్తే బ్యాంకుల్లో వడ్డీ బాగా ఎక్కువగా వేస్తారని ఆలోచించి తిరిగి 2021 జనవరి 29న నివాస గృహం నిర్మిస్తున్నట్లుగా పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకుని మళ్లీ రూ. 1,05,300 ఫీజు కట్టారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో నివాస గృహానికి సంబంధించి పర్మిషన్ ఇచ్చేశారు. ఈ పత్రాలతో బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే సదరు డిస్పెన్సరీ యజమాని రూ. 2 కోట్లకు పైగా రుణం తీసుకున్నారు. కమర్షియల్ కాస్త రెసిడెంట్‌గా మారడంతో ఇటు బల్దియాకు ఆస్తి పన్ను రూపంలో భారీగా గండి పడగా, బ్యాంకుకు కూడా కమర్షియల్‌గా రావాల్సిన వడ్డీ తగ్గిపోయింది. ఈ వ్యవహారంలో టీపీవోలు, లైసెన్స్ సర్వేయర్లు, బ్యాంకు వాల్యువర్లు కాసులకు కక్కుర్తి పడి పనులన్నీ చక్కబెట్టారు.

▪ గంజ్ మార్కెట్‌లో..

గంజ్‌మార్కెట్ ప్రాతంలో 2011లో ఓ వ్యక్తి తన ఇళ్లను కమర్షియల్‌గా మార్చుతూ అనుమతి తీసుకున్నారు. అయితే కమర్షియల్‌గా మార్చితే ఆస్తిపన్ను ఎక్కువ కట్టాల్సి వస్తుదనే ఆలోచనలో టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించారు. ఓ లైసెన్స్ సర్వేయర్ ద్వారా నివాస గృహాలకు సంబంధించి డాక్యుమెంట్లు తయారు చేసి టౌన్‌ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై నివాస గృహానికి సంబంధించిన అనుమతులు తీసుకున్నారు. ఈ నివాసగృహ అనుమతి పత్రాలతో బ్యాంకు నుంచి రూ. 10 లక్షలకు పైగా గుండారంలోని ఓ బ్యాంక్ ద్వారా రుణం కూడా తీసుకున్నారు. ఈ విషయమై అన్ని సక్రమంగా పనులు పూర్తి చేసిన మరో లైసెన్సు సర్వేయర్‌కు అనవసరంగా నోటీసివ్వడంతో ఆర్టీఐ ద్వారా సమాచారం రాబట్టగా అసలు నిజాలు బయటకు వస్తాయనే భయంతో టీపీ అధికారులే ఫైల్ మాయం చేయడం విస్మయాన్ని గురిచేస్తోంది.

మున్సిపల్ కమిషనర్ స్పందిస్తేనే..

ఓ సామన్య వ్యక్తి నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు నానా కొర్రీలు పెట్టి ముప్పుతిప్పలు పెడతారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ లైసెన్సు సర్వేయర్లతో కలిసి అక్రమాలకు తెరలేపారు. దొంగ పత్రాలు సృష్టించడంలో దిట్టగా మారారు. మున్సిపల్ కమిషనర్ స్పందిస్తే బల్దియాలో జరుగుతున్న అక్రమాలు మరిన్ని వెలుగులోకొచ్చే అవకాశాలున్నాయి.

క్లుప్తంగా

ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచాలి



నిజామాబాద్‌ సిటీ: ప్రభుత్వ బడుల పదో తరగతి ఫలితాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని, ప్రజలకు ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచాలని డీఈవో దుర్గాప్రసాద్‌ పేర్కొన్నారు. నగర శివారులోని గూపన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై, మాట్లాడారు. చదువు జ్ఞానాన్ని పెంచితే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు సంస్కారాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్పొరేటర్‌ శ్రీనివాసరెడ్డి, సంతోష్‌రెడ్డి, సంగరాజు, నిశిత కళాశాల ప్రిన్సిపల్‌ జయంత్‌ రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్‌ లక్ష్మి, రాజారెడ్డి, మధు పాల్గొన్నారు.

అసలే కడతం.. వడ్డీ చెల్లించం..



ఎడపల్లి(బోధన్‌): పది సంవత్సరాల క్రితం తాము తీసుకున్న ఎల్‌టీ లోన్‌లకు వడ్డీకి చక్ర వడ్డీ వేసి జిల్లా సహకారశాఖ వారు మోయలేని భారం విధించారని, దీంతో రుణాలు చెల్లించలేమని గతంలో తీసుకున్న అసలు మాత్రమే వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని మండలంలోని ఎడపల్లి సింగిల్‌ విండో పరిధిలోని ఠాణ కలాన్‌, ధర్మారం, ఓడ్డెపల్లి రైతులు స్పష్టం చేశారు. బలవంతం చేస్తే ఆత్మహత్య చేసుకుంటాం తప్పా రుణాలు చెల్లించలేమని హెచ్చరించారు. జిల్లా సహకార శాఖ ఓఎస్‌డీ గంగాధర్‌ రుణాలు తీసుకున్న రైతులతో శుక్రవారం ఎడపల్లి సహకార సంఘంలో సమావేశం ఏర్పాటు చేసి, రుణాలు చెల్లించాలని కోరారు. రుణాలు మాఫీ అవుతాయని ఇంతకాలం ఎదురు చూసామని, తాము తీసుకున్న రుణాలు మాఫీ చేయడం లేదని రైతులు ప్రశ్నించారు. జిల్లాలో ఎల్‌టీ రుణాలు ఎక్కడ మాఫీ కాలేదని వీటిని తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని ఓఎస్‌డీ స్పష్టం చేశారు. రైతులు గణపతిరెడ్డి, ఆకుల గోపి, పరమలి సాయిలు, కల్లెడ సాయిలు, స్వామి, భూపతి ఉన్నారు.

విధులకు హాజరు కాకున్నా జీతం చెల్లింపు

ఎడపల్లి(బోధన్‌): విద్యుత్‌ శాఖలో పనిచేసే ఒక ఉద్యోగి రెండు నెలలుగా విధులకు హాజరు కాకున్నా.. జీతాలు చెల్లించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. ఎడపల్లి విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌లో ఆర్టిజన్‌ ఎంప్లాయ్‌గా (సబ్‌ స్టేషన్‌ ఆపరేటర్‌) పనిచేస్తున్న రాజశేఖర్‌ రెండు నెలలుగా విధులకు హాజరు కాలేదు. అయినా విద్యుత్‌ శాఖ అధికారులు ఆయనకు రెండు నెలల జీతాలు చెల్లించారు. ఈ విషయం ఇతర సిబ్బందికి తెలియడంతో బహిర్గతమైంది. ఈమేరకు శుక్రవారం ఎడపల్లి సబ్‌ డివిజన్‌ ఏడీఈ లక్ష్మణ్‌ నాయక్‌ను ప్రశ్నించగా వాస్తవమేనని తెలిపారు. ఇది టెక్నికల్‌గా జరిగిన పొరపాటు అని అన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని.. రాజశేఖర్‌ నుంచి రెండు నెలల జీతాలను రికవరీ చేసినట్టు తెలిపారు.

ప్రశ్నార్థకంగా ప్రసూతి సేవలు

- మోర్తాడ్‌ సీహెచ్‌సీలో రెండేళ్లుగా అందని వైనం
- ఆర్మూర్‌ ఆస్పత్రి, ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణులు



ప్రయివేటు వైద్యులను రప్పించినా..

మోర్తాడ్‌: ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'మార్పు' కార్యక్రమాన్ని చేపట్టింది. అయినా మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌లో మాత్రం ప్రసవాల సేవలు కొనసాగడం లేదు. గైనకాలజిస్టు(స్త్రీ వైద్య నిపుణులు), అనాస్థీషియా(మత్తు) వైద్యులు రాకపోవడంతో రెండేళ్ల నుంచి మోర్తాడ్‌లో ప్రసవ సేవలు నిలచిపోయాయి. దీంతో మోర్తాడ్‌ సమీప ప్రాంత గర్భిణులు ప్రసవం కోసం ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి లేదా ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తుంది.

ఇక్కడి ఆస్పత్రిలో వైద్యులు ఉన్నా వారిలో గైనకాలజిస్టు, అనాస్థీషియాలు లేకపోవడంతో ఆర్మూర్‌ నుంచి ప్రయివేటు వైద్యులను పిలిపించి వారితో శస్త్ర చికిత్సలు చేయించాల్సి వచ్చింది. ప్రతి బుధ, శుక్ర వారాల్లో గర్భిణులకు శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవం చేశారు. శస్త్ర చికిత్స ద్వారా ప్రసవం చేసినందుకు గైనకాలజిస్టుకు రూ.2,500 అనాస్థీషియాకు రూ.2,500ల చొప్పున చెల్లించేవారు. గైనకాలజిస్టులు, అనస్థీషియాలు మోర్తాడ్‌ ఆస్పత్రికి రావడానికి ఆసక్తి చూపకపోవడంతో ప్రసవ సేవలు నిలిచిపోయాయి. ఎంతో మంది పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారు ప్రసవం కోసం మోర్తాడ్‌ ఆస్పత్రికి వస్తుండగా ఇక్కడ ప్రసవ సేవలు చేయకపోవడంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం కోసం వెళుతున్నారు. అక్కడ రద్దీ ఎక్కువ ఉంటే ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ప్రయివేటు ఆస్పత్రులలో భారీగా ఫీజు వసూలు చేస్తుండటంతో పేదలకు, మధ్య తరగతి కుటుంబాల వారికి ఆర్థిక భారం ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రసవ సేవలను మోర్తాడ్‌లో పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

వీవీపీలో విలీనం చేసినా..

కొన్ని నెలల క్రితమే మోర్తాడ్‌ ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేశారు. అయినా ఆస్పత్రిలో సేవలు మెరుగుపడటం లేదు. మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ పరిధిలో మోర్తాడ్‌, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, వేల్పూర్‌, భీమ్‌గల్‌ మండలాలు ఉన్నా యి. అయితే సాధారణ ప్రసవాలను చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్నారు. శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలను మాత్రం మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌లోనే నిర్వహిస్తున్నారు. 2018లో మోర్తాడ్‌ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స ద్వారా ప్రసవాలు ఆరంభం అయ్యాయి. మార్పు పథకం అమలుతో మోర్తాడ్‌ ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో ప్రసవాలు జరిగాయి. అయితే రెండేళ్ల నుంచి మాత్రం ఒక్క ప్రసవం కూడా జరుగలేదు.

నియామకాలు చేపట్టాలి..



తెలంగాణ ప్రభుత్వం చెప్పేది ఒకటి. చేసేది మరోటి ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలను మెరుగుపరిచినట్లు చెబుతున్నా ఆచరణలో మాత్రం విఫలమైంది. వైద్యుల నియామకాలు చేపట్టకపోతే రోగులకు ఎలా వైద్య సేవలు అందిస్తారు. ప్రచారం యావలో అసలు పని చేయడం మరిచిపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, వైద్యుల నియామకాలు చేపట్టాలి. – ఆడెపు సవిత, ఎంపీటీసీ, తాళ్లరాంపూర్‌

'జోడో పాదయాత్ర'ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనిల్‌

మోర్తాడ్‌: బాల్కొండ నియోజకవర్గంలో ఈనెల 13న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న హాత్‌ సే హాత్‌ జోడో పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌, జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కోరా రు. ఏర్గట్లలో వారు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం రాత్రి రేవంత్‌రెడ్డి కమ్మర్‌పల్లికి చేరుకుని బస చేస్తారని తెలిపారు. ఆదివారం లింబాద్రిగుట్ట లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకుని కమ్మర్‌పల్లిలో రైతులతో ఇష్టాగోష్ఠిగా మా ట్లాడుతారని వెల్లడించారు. నాయకులు శివకుమార్‌, సోమ దేవారెడ్డి, గంగాప్రసాద్‌ పాల్గొన్నారు.

తెగిన విద్యుత్‌ వైరు.. కాలిన మీటర్లు



ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద తెగిపోయిన వైర్లను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు



గోపాల్‌పేటలోని ఓ భవనంలో కాలిపోయిన విద్యుత్‌ మీటర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేటలో శుక్రవారం 11కేవీ విద్యుత్‌ వైరు తెగిపడడంతో గ్రామంలోని పలువురి ఇళ్లల్లో ఉన్న విద్యుత్‌ మీటర్లు దగ్ధమయ్యాయి. దీంతోపాటు ఇళ్లల్లో ఉన్న టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. వివరాలు ఇలా.. మండలకేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద పాలిమార్‌ డిస్క్‌ ఫెయిల్‌ కావడంతో 11కేవీ విద్యుత్‌ వైరు తెగిపోయి ఎల్‌టీ లైన్‌ వైర్లపై పడింది. దీంతో మంటలు లేచి వైర్లు తెగి, కిందపడ్డాయి. ఆ సమయంలో స్థానికులు అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. కానీ సుమారు యాభై ఇళ్లల్లో మీటర్లు, టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. దీంతో తమకు ట్రాన్స్‌కో తరఫున నష్టపరిహారం అందించాలని బాధితులు డిమాండ్‌ చేశారు. ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్‌, లైన్‌ఇన్‌స్పెక్టర్‌ సురేందర్‌, లైన్‌మెన్‌ శశికాంత్‌రెడ్డి, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మరమ్మతులు చేసి విద్యుత్‌ సరఫరాను పునఃరుద్ధరించారు.

కలప లారీ పట్టివేత!



ఎడపల్లి(బోధన్‌): మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు కలపను లారీలో తరలిస్తుండగా నవీపేట శివారులో పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. మండలంలోని అలీసాగర్‌ లిఫ్ట్‌ వద్ద కలప లారీ డ్రైవర్‌, ఆర్టీసీ బస్‌ డ్రైవర్‌ గొడవ పడటంతో సమాచారం అందుకున్న పోలీసులు లారీని పట్టుకోవడానికి యత్నించారు. కానీ డ్రైవర్‌ లారీని నవీపేట వైపు వేగంగా తీసుకువెళ్లగా ఎస్సై పాండేరావు లారీ(ఎంహెచ్‌ 12ఎన్‌కె3191)ని నవీపేట శివారులో పట్టుకున్నాడు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లారీని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. లారీలోని కలపను పరిశీలించిన తర్వాత అటవీశాఖ అధికారులు సామీల్‌కు అందజేయనున్నట్లు తెలిసింది.

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- తొమ్మిదేళ్లలో రూ.10వేల కోట్ల నిధులు కేటాయింపు
- స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్‌: బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని, నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలుకు తొమ్మిదేళ్లలో రూ.10వేల కోట్లు వెచ్చించినట్లు స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రుద్రూర్‌ మండలం సులేమన్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్‌ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ సహకారంతో నియోజకవర్గ ప్రజలకు అవసరమగు సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సులేమన్‌నగర్‌ గ్రామాభివృద్ధికి ఇప్పటి వరకు రూ.2కోట్ల 76లక్షలు కేటాయించామన్నారు. అనంతరం రాణంపల్లిలో నూతనంగా నిర్మించిన బారెడు పోచమ్మ దేవి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి స్పీకర్‌ హాజరై, పూజలు నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన రూ.25లక్షలతో పాటు మరో రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. సర్పంచులు రోజాలక్ష్మణ్‌, ఖాదర్‌, ఎంపీపీ సుజాత, జెడ్పీటీసీ గంగారాం, సంఘమేశ్వర్‌రావ్‌ ఉన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

రుద్రూర్‌: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. కోటగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి స్పీకర్‌ హాజరై, మాట్లాడారు. కోటగిరి హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 33లక్షలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ చేశారు. బోధన్‌ ఆర్డీవో రాజేశ్వర్‌, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ శంకర్‌, సర్పంచ్‌ పత్తి లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం పనిచేసేది కాంగ్రెస్‌ పార్టీ

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఐటీ సెల్‌ చైర్మన్‌ మదన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతుల కోసం అహర్నిషలు శ్రమించి పనిచేసేది కాంగ్రెస్‌ పార్టీ ఒక్కటే అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఐటీ సెల్‌ చైర్మన్‌ మదన్‌మోహన్‌రావు వెల్లడించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 35ఏళ్లుగా ఎల్లారెడ్డి నియోజకవర్గం దగాకు గురైందన్నారు. ఒక ఎమ్మెల్యే భూములు లాక్కొని తనది తాను అభివృద్ధి చేసుకున్నాడన్నారు. మరొకరు పార్టీ మారి ఆస్తులు కూడకట్టుకున్నాడని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే కేవలం కాంగ్రెస్‌ పార్టీ మాత్రమే అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్‌ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు. పార్టీ అధికారంలో లేకున్నా తాను నియోజకవర్గంలో ఒక ఎమ్మెల్యే కంటే ఎక్కువ సేవలు ప్రజలకు చేశానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని భరోసా ఇచ్చారు.

300 మంది కాంగ్రెస్‌లో చేరిక..

లింగంపేట మండలంలోని 41 గ్రామ పంచాయతీల నుంచి సుమారు 300 మంది మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు బుర్ర నారాగౌడ్‌, జొన్నల రాజు, రఫీక్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే పొల్కంపేట మాజీ సర్పంచ్‌ మంజుల ఎల్లేశం తన అనుచరులతో కాంగ్రెస పార్టీ కండువ వేసుకున్నారు.

తెయూ సమాచారం..

■ తెయూ అధ్యాపకులకు పదోన్నతి



తెయూ(డిచ్‌పల్లి): కెరీర్‌ అడ్వాన్స్‌మెంట్‌ స్కీమ్‌ (సీఏఎస్‌)లో భాగంగా తెలంగాణ యూనివర్సిటీలో ఎనిమిది మంది అధ్యాపకులకు పదోన్నతులు కల్పించారు. ఈమేరకు శుక్రవారం తన ఛాంబర్‌లో తెయూ వీసీ ప్రొఫెసర్‌ రవీందర్‌ పదోన్నతులు పొందిన అధ్యాపకులకు ఉత్తర్వులు అందజేశారు. అసోసియేట్‌ నుంచి ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందిన అధ్యాపకుల్లో అపర్ణ (ఎంబీఏ), రాంబాబు (కామర్స్‌), ఘంటా చంద్రశేఖర్‌ (మాస్‌ కమ్యూనికేషన్‌), లావణ్య, త్రివేణి, బాల శ్రీనివాసమూర్తి (తెలుగు) ఉన్నారు. అసిస్టెంట్‌ నుంచి అసోసియేట్‌గా పదోన్నతి పొందిన వారిలో సాయిలు (కెమిస్ట్రీ), సుధాకర్‌గౌడ్‌ (జియో ఇన్ఫర్మాటిక్స్‌) ఉన్నారు. పదోన్నతి ఉత్తర్వులు 2022 జనవరి 29 నుంచి అమలులోకి వస్తాయని వర్సిటీ అధికారులు తెలిపారు.

■ పుస్తకం ఆవిష్కరణ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సారంగాపూర్‌ ఎడ్యుకేషన్‌ కాలేజ్‌ ఎంఈడీ అధ్యాపకులు బదావత్‌ గణేష్‌, తుపాకుల లింగమూర్తి సంయుక్తంగా యోగాపై రాసిన పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్‌ రవీందర్‌ శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. 'అంతర్గత స్వీయ ధ్యానం, బాహ్య సామాజిక చర్య సంపూర్ణ వ్యవస్థ' పేరిట రాసిన పుస్తకం అందరికీ ఉపయోగపడుతుందని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ విద్యావర్ధిని, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌ మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

■ ప్రశాంతంగా పీజీ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మూడవ సెమిస్టర్‌ పరీక్షలో 462మంది విద్యార్థులకు గానూ 435మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్‌ పరీక్షలో 562మందికి గానూ 518మంది హాజరయ్యారు. క్యాంపస్‌లోని కామర్స్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కంట్రోలర్‌ అరుణ తనిఖీ చేశారు.

బాలిక అదృశ్యం

రాజంపేట: మెదక్‌ జిల్లాలోని దూప్‌సింగ్‌ తండాకు చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో జీరో ఎఫ్‌ఐర్‌ నమోదు చేసినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా... మెదక్‌ జిల్లా హవేలి ఘన్‌పూర్‌ మండలం వాడి పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్‌ తండాకు చెందిన బాలిక, గురువారం రాజంపేట మండలం ఎల్లాపూర్‌తండాలో టైలరింగ్‌ నేర్చుకునేందుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పింది. బాలిక తిరిగి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం రాజంపేట పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జీరో ఎఫ్‌ఐఆర్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌


బీజేపీ నాయకులపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి: బెదిరింపులకు పాల్పడ్డ కమ్మర్‌పల్లి మండల బీజేపీ నాయకులతో పాటు, ఇతర గ్రామాల నాయకులపై కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలా ఇలా.. మండలంలోని బషీరాబాద్‌కు చెందిన శ్రీరాముల వరలక్ష్మి ఇంట్లోకి గురువారం ఉదయం బీజేపీ నేతలు నిమ్మల శ్రీనివాస్‌, మల్కన్నగారి మోహన్‌, కొమ్ముల సంతోష్‌, కొత్తపల్లి అరుణ్‌, కొత్వాల్‌ క్రాంతి, కట్ట సంజీవ్‌, ఎలాల వెంకట్‌రెడ్డి తదితరులు అక్రమంగా ప్రవేశించి, మీ కొడుకు శ్రీరాముల సుమన్‌ వాట్సాప్‌లో తమ నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డిని కించపరిచే విధంగా పోస్టు పెట్టాడని, సుమన్‌ చంపడానికి వచ్చామని భయపెట్టారు. వరలక్ష్మి, అతని కోడలును అసభ్య పదజాలంతో దూషిస్తూ, భయపెట్టారు. దీంతో బీజేపీ నాయకులతో తమకు ప్రాణం భయం ఉందని శుక్రవారం బాధితులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌ తెలిపారు.

బస్సును ఢీకొన్న వ్యాన్‌

భిక్కనూరు: మండలంలోని బీటీఎస్‌ చౌరస్తా వద్ద గల జాతీయ రహదారిపై శుక్రవారం వేకువ జామున ఆర్టీసీ బస్సును వెనుక నుంచి డీసీఎం వ్యాన్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. వివరాలు ఇలా.. నిర్మల్‌ ఆర్టీసీ డిపో బస్సు హైదరాబాద్‌ నుంచి నిర్మల్‌కు వెళ్తుండగా.. బీటీఎస్‌ చౌరస్తా వద్ద ముందు వెళ్తున్న వాహనం డ్రైవర్‌ సడన్‌ బ్రేక్‌ వేయడంతో బస్సు డ్రైవరు సడన్‌ బ్రేక్‌ వేశాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో బస్సు వెనుక భాగం దెబ్బతింది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. బస్సు డ్రైవర్‌ ఫిర్యాదు మేరకు వ్యాన్‌ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ వివరించారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌ రామకృష్ణారెడ్డి మృతి



రామకృష్ణారెడ్డి (ఫైల్‌)

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): సీనియర్‌ రాజకీయ నాయకుడు, నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌కమిటీ (ఏఎంసీ) మాజీ చైర్మన్‌, డిచ్‌పల్లి తొలి ఎంపీపీ నల్లూరి రామకృష్ణారెడ్డి (75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. నగరంలోని తన స్వగృహంలో శుక్రవారం ఉదయం మృతి చెందారు. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌ (డి) రామకృష్ణారెడ్డి స్వగ్రామం. నగరంలోని కపిల హోటల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌గా రామకృష్ణారెడ్డి అందరికీ సుపరిచితుడు. 1970–1987 వరకు రాంపూర్‌ గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. అనంతరం డీసీఎంస్‌ చైర్మన్‌గా, డిచ్‌పల్లి తొలి ఎంపీపీగా పదవిలో కొనసాగారు. ఆయనకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఒక కూతురు అమెరికాలో ఉన్నందున ఆమె వచ్చిన తర్వాత ఆదివారం నగరంలోని సార్వజనిక్‌ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

గుండెపోటుతో ముగ్గురి మృతి

నిజామాబాద్‌, కామారెడ్డి ఉభయ జిల్లాల్లో శుక్రవారం గుండెపోటుతో ముగ్గురు మృత్యువాడ పడ్డారు. నిజామాబాద్‌ జిల్లాకేంద్రంలో ఓ వ్యక్తి బ్యాంక్‌కు వెళ్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందగా.. భిక్కనూరులో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందింది. పిట్లం మండలంలోని చిన్నకోడపగల్‌లో ఓ వ్యక్తి హోటల్‌లో టీ తాగివస్తుండగా గుండెపోటుకు గురై మృతిచెందాడు

నిజామాబాద్‌ సిటీ: నగరంలో ఓ వ్యక్తి బ్యాంక్‌కు వెళ్తుండగా గుండెపోటుకు గురై మృతిచెందాడు. రూరల్‌ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని గాజుల్‌పేట్‌కు చెందిన కుకునూర్‌ రవి (32) ఓ వస్త్రా దుకాణంలో పనిచేసేవాడు. శుక్రవారం మధ్యాహ్నం షాప్‌ యజమాని డబ్బులు బ్యాంక్‌లో జమా చేయమని డబ్బులు ఇవ్వగా.. రవి హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్దకు వచ్చాడు. అక్కడికి రాగానే ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో ఏటీఎం పక్కనే గల మెడికల్‌ షాప్‌లోకి వెళ్లి, ఓ ట్యాబ్‌లెట్‌ వేసుకున్నాడు. అనంతరం బయటకు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోగా అతని తలకు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనస్థలానికి చేరుకొని, రవి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రవి వద్ద గల నగదును మెడికల్‌ షాప్‌వారు భద్రపరిచి, పోలీసులకు అందించారు. మృతిడి భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటికి పెద్ద దిక్కు అయిన రవి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.



రవి మృతదేహం

భిక్కనూరులో..

భిక్కనూరు: మండలకేంద్రంలో ఓ వృద్ధురాలు మూడురోజుల క్రితం గుండెపోటుకు గురికాగా.. శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన పేష్కారి శకుంతల(64)కు మూడు రోజుల క్రితం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు స్టంట్‌ వేసినప్పటికీ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. శనివారం ఉదయం భిక్కనూరు మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.



శకుంతల (ఫైల్‌)

పిట్లం మండలంలో..

పిట్లం(జుక్కల్‌): మండలంలోని చిన్నకోడపగల్‌ గ్రామంలో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన నారాయణ(60) శుక్రవారం ఉదయం టీ తాగడానికి గ్రామంలోని ఓ టీస్టాల్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో కిందపడిపోయాడు. స్థానికులు అతడిని పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



నారాయణ (ఫైల్‌)

పీడీఎస్‌ బియ్యం పట్టివేత!



బాన్సువాడ టౌన్‌: బాన్సువాడ వైపు నుంచి బిచ్కుంద మండలం గుండెనెమ్లి రైస్‌మిల్‌కు వెళ్తున్న పీడీఎస్‌ బియ్యం లారీని గురువారం రాత్రి బాన్సువాడ పోలీసులు పట్టుకున్నారు. గుండెనెమ్లి రైస్‌ మిల్‌ నుంచి పీడీఎస్‌ బియ్యం ఎఫ్‌సీఐకి పంపించామని అక్కడి అధికారులు బియ్యంను రిజెక్ట్‌ చేయడంతో తిరిగి రైస్‌మిల్‌కు తీసుకువస్తున్నామని రైస్‌ మిల్‌ యజమాని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు లారీని తహసీల్‌దార్‌కు అప్పగించారు. పీడీఎస్‌ బియ్యం తరలించినట్లు అధికారులు విచారణలో తేలితే, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్‌

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): నస్రుల్లాబాద్‌ మండలంలోని నాచుపల్లి మినీ గురుకుల బాలికల పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు ఇటీవల మూడో తరగతి విద్యార్థిని చితకబాదింది. దీంతో బాలిక జ్వరంతో బాధపడుతుందని తెలిసింది. ఈవిషయం ఎంపిపి పాల్త్య విఠల్‌కు తండ్రి తార్యనాయక్‌ ఫిర్యాదు చేయడంతో శుక్రవారం హాస్టల్‌ను సందర్శించారు. సంగీత అనే ఉపాధ్యాయురాలు కొట్టినట్లు నిర్ధారణ అయిందని వెంటనే సస్పెండ్‌ చేశామని వార్డెన్‌ ప్రియదర్శిని వివరించారు. ఈ విషయంపై విద్యార్థిని తండ్రి ఆర్‌సివో సంపత్‌కు సైతం కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడని, నివేదిక తయారు చేసి పంపిస్తే సదరు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుంటామన్నట్లు వివరణ ఇచ్చారు.



జీవితంపై విరక్తితో ఆత్మహత్య

ఎల్లారెడ్డి: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గండిమాసానిపేట గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గణేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. గండిమాసానిపేట గ్రామంలోని ఇటుకల బట్టీలో కూలీ పనులు చేసుకునే గడేకర్‌ మారుతి (19) అనే యువకుడు తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ముక్తాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.



మారుతి (ఫైల్‌)